క్లుప్తంగా

వెంకటేశ్వరునికి జన్మ నక్షత్ర పూజలు


యండమూరులోని మీసాల వెంకటేశ్వరస్వామి

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని వెంకటేశ్వరస్వామివారి జన్మనక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రధానఅర్చకుడు పెద్దింటి సీతారామం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో వెంకటేశ్వరస్వామి వ్రతాలు చేయించారు. అలాగే పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి, కూరాడ తదితర గ్రామాల్లోని వెంకటేశ్వర ఆలయాల్లో స్వామివారికి అర్చకులు జన్మనక్షత్ర పూజలు చేశారు. యండమూరులోని మీసాల వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని, మొక్కుకుని ఏడు శనివారాలు వచ్చి ఏడుసార్లు ప్రదక్షిణచేసి, పూజలు చేస్తే, కోరిన కోర్కెలు నెరవేరతాయని అర్చకులు తెలిపారు.

సేవలతో ఎంతో సంతృప్తి


వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందిస్తున్న రత్నమాల

బోట్‌క్లబ్: సేవా కార్యక్రమాలు ద్వారా ఎంతో సంతృప్తి లభిస్తుందని లయన్స్‌క్లబ్ సఖి సభ్యురాలు ఎస్.రత్నమాల అన్నారు. ఆమె జన్మదినం సందర్భంగా ఆదివారం స్థానిక అమ్మ వృద్ధుల ఆశ్రమంలో మూడు నెలలకు అవసరమైన నిత్యవసర వస్తువులను అందించారు. కార్యక్రమంలో సఖి క్లబ్ సభ్యులు ఎస్.లక్ష్మీ, రమణ, సావిత్రి, వెంకటలక్ష్మీ, దార సునీత పాల్గొన్నారు.

వృద్ధులను వేధించడం నేరం


వృద్ధులపై వేధింపులు నివారించాలని కోరుతూ ర్యాలీ చేస్తున్న సీనియర్ సిటిజన్లు

కాకినాడ రూరల్: వృద్ధులను వేధించడం, కని పెంచి పోషించిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఆదరించకపోవడం చట్టరీత్యా నేరమని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినాన్ని పురస్కరించుకుని సీనియర్ సిటిజన్స్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులపై వేధింపులు నివారణ కోరుతూ ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత తహశీల్దార్ రేలంగి బాపిరాజు, యనమల రామం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా పేరొందాలి


రక్తదానం చేస్తున్న సభ్యులు

బాలాజీచెరువు: రక్తదానంతో ప్రాణదాతలుగా పేరొందాలని అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణన్ అధ్యక్షుడు యళ్ల రత్నారావు పేర్కొన్నారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్‌లో ఆదివారం రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నారావు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న యువకులు రక్తదానం చేయాలని, రక్తదానంపై అపోహలు తొలగి స్వచ్ఛందంగా ముందుకురావాలన్నారు. అనంతరం రక్తదాతలకు అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ డాక్టర్ పి.కామరాజు, క్లబ్ కార్యదర్శి డి.రామకృష్ణ, జిల్లా చైర్మన్ పడాల సూర్యనారాయణరెడ్డి, దిలీప్‌కుమార్ సదనాని తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్‌పై ఆటో బోల్తా

సామర్లకోట: స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఆటో బోల్తా పడటంతో ఇద్దరు గాయపడ్డారు. ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం ఆదివారం మండల పరిధిలో పనసపాడు గ్రామానికి చెందిన 10 మంది బంధువులు మురారి గ్రామంలో ఒక శుభకార్యానికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తూండగా ట్రాఫిక్ రద్దీగా కారణంగా గోతులు తప్పించే క్రమంలో ఫ్లై ఓవర్‌పై ఆటో బోల్తా పడింది. దీనితో ఆటోలో ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తన సిబ్బందితో ఘటనా ప్రదేశానికి చేరుకుని వారిని సురక్షితంగా బయటకు తీశారు. క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారాలను వీధిన పడేశారు..

- భరోసా కోసం వ్యాపారుల ఎదురుచూపు
- ప్రైవేటు అప్పులకే సరిపోతున్న రాబడి
- వడ్డీలేని రుణాలు ఇవ్వాలని వేడుకోలు


గాంధీనగర్‌లో రోడ్డు పక్క వీధి వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులు

బోట్‌క్లబ్: రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే వీధి వ్యాపారులకు గత ప్రభుత్వం అండగా నిలిచింది. వారికి పెట్టుబడి కోసం రూ.10 వేలు వడ్డీ లేకుండా రుణం అందించేది. దీంతో వారు వ్యాపారుల వద్ద నుంచి అప్పులు తెచ్చుకొనే పరిస్థితి ఉండేది కాదు. అప్పులు సక్రమంగా చెల్లించడంతో బ్యాంకులు సైతం వారికి ఇతర రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి వీధి వ్యాపారులకు భరోసా లేకుండా పోయింది. దీంతో ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక వడ్డీలు తెచ్చుకుని నిత్యం వ్యాపారం చేసుకుని వారికి వచ్చిన లాభం వడ్డీలకే పోతోంది. ప్రతి రోజు రూ.500 సంపాదిస్తే దానిలో రూ.300 నుంచి రూ.400 వడ్డీ కింద కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వీధి వ్యాపారుల కష్టాన్ని పాదయాత్రలో స్వయంగా చూసి చలించి వారికి వడ్డీ లేకుండా రుణం అందించారు. కాకినాడ నగరంలో 8 వేల మంది తగ్గకుండా వీధి వ్యాపారులకు ఏటా రుణాలు అందించారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా వలంటీర్ల సాయంతో రుణాలు అందించే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం బ్యాంకులు వీరికి ఎటువంటి రుణాలు మంజూరు చేయడం లేదు. వీధి వ్యాపారులకు ఇచ్చే రుణాలకు సంబంధించి ప్రభుత్వం ఆయా బ్యాంకులకు చెల్లించేది. దీంతో బ్యాంకులు సైతం వీధి వ్యాపారులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చేవారు. ప్రస్తుతం బ్యాంకులకు వీధి వ్యాపారులు రుణాల విషయంతో ఎటువంటి మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో వడ్డీ లేని రుణాలు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో వీధి వ్యాపారులు ప్రైవేటు వ్యాపారస్తుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

ఈ పథకం కొనసాగించాలి

వడ్డీలేని రుణాలు వీధి వ్యాపారులకు ఎంతో అండగా నిలిచేవి. అటువంటి పథకం ప్రస్తుతం కొనసాగించాలని వీధి వ్యాపారులు కోరుతున్నారు. ఈ పథకం ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించాలని వారు కోరుతున్నారు.

ఏడాది గడిచినా ఆ ప్రతిపాదనే లేదు..

కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయ్యిందని పెద్ద ఎత్తున సంబరాలు జరపుకుంటోంది తప్ప వీధి వ్యాపారులకు ఏమీ చేయలేదు. కాకినాడ నగరంలో వేలల్లో ఉన్న వీధి వ్యాపారులకు కనీసం ఒక్క రూపాయి కూడా రుణం ఇచ్చిన పాపాన పోలేదు. ఏడాది గడుస్తున్నా వీధి వ్యాపారుల కోసం ఏ పథకంలో కూడా రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవు. కనీసం పాత పథకాన్ని అయినా కొనసాగించాలని వీధి వ్యాపారులు కోరుతున్నారు.

రుణం అండగా నిలిచింది



గత ప్రభుత్వమే అండగా నిలిచి వడ్డీ లేకుండా రుణం ఇవ్వడం మాకు ఎంతో ఆసరాగా ఉండేది. ఇచ్చిన రుణంలో పండ్లు కొనుగోలు చేసుకొని ప్రతీ రోజు విక్రయించడంతో వచ్చిన డబ్బులు ఇంటికి తీసుకువెళ్లేవాళ్లం. ప్రస్తుతం బ్యాంకుల్లో వడ్డీ లేని రుణాలు ఇవ్వడం లేదు. దీంతో బయట వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకోవాల్సి వస్తోంది. వడ్డీ లేని రుణాల పథకం కొనసాగించాలి.

– గుర్రుర్తి రమణ, చిరు వ్యాపారి

వీధి వ్యాపారులను ఆదుకోవాలి



ఉదయం నుంచి రాత్రి వరకూ రూ. 2 నుంచి రూ.3 వేలు పెట్టుబడి పెడితే వచ్చే లాభం రూ.500. పెట్టుబడి కూడా బయట వ్యాపారులు నుంచి తెచ్చుకుంటే వారికి వడ్డీ చెల్లిస్తే తాము భార్య పిల్లలను ఎలా పెంచాలో తెలియడం లేదు. వడ్డీలు లేని రుణాలు ఇచ్చి ప్రభుత్వం మమ్ముల్ని ఆదుకోవాలి.

– కోటపురెడ్డి రాజు, కొబ్బరిబొండాలు వ్యాపారి

26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు


కాకినాడ ఏపీఎస్పీ వద్ద హ్రీం పీఠంలో వారాహి అమ్మవారు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో ఏపీఎస్పీ సమీపంలో శ్రీలలితా వారాహి రాజ శ్యామల సన్నిధానం (హ్రీం పీఠం)లో ఈనెల 26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు సజావుగా జరగాలని కోరుతూ ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించినట్లు నిర్వహకుడు ఈశ్వర్ తెలియజేశారు. ఈ నెల 26 నుంచి జూలై 5 వరకు ప్రతి రోజు అమ్మ వారికి పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహిస్తామని, అమ్మ వారి దీక్ష తీసుకునే వారికి ఇక్కడే పూజలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆయన మీడియాకు తెలియజేవారు. ఆదివారం లక్ష్మీ గణపతి, వారాహి, లలితా, రాజ్యశ్యామల హోమాలు నిర్వహించి నవరాత్రులకు ఆటంకాలు కలగరాదని కోరుకున్నట్టు తెలిపారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం


వేసవి శిబిరంలో పాల్గొన్న పిల్లలతో కమాండెంట్ నాగేంద్రరావు తదితరులు

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో నిర్వహిస్తున్న బాస్కెట్ బాల్ సమ్మర్ క్యాంప్ ముగింపోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్పీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జాతీయ స్థాయిలో 12 మంది, రాష్ట్ర స్థాయిలో 20 మంది, జిల్లా స్థాయిలో 26 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. వీరందరికీ కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు పతకాలను ప్రదానం చేశారు. వేసవి శిబిరంలో బాస్కెట్‌బాల్ క్రీడలో మెళకువలు నేర్చుకున్న పిల్లలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబ్బరాజు, మాజీ అథ్లెట్ ప్రసాద్, సీనియర్ ప్లేయర్ పిల్ల సత్యనారాయణ, ఆర్ఐలు అజయ్‌కుమార్, వేసవి శిబిరంలో పాల్గొన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కులాన్ని రోడ్డు మీదకు లాగవద్దు

పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పద్మశాలీ సంక్షేమ సంఘం నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఉమ్మడి గోదావరి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘాన్ని 25 ఏళ్లుగా నిర్వహిస్తున్న తనపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదని ఆ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ అన్నారు. కాకినాడలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. చేనేత కులం అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసినట్లు చెప్పారు. ఇటీవల కొందరు వ్యక్తులు తనపై లేనిపోని బురద జల్లుతున్నారన్నారు. జిల్లాలు విడిపోయిన తర్వాత పద్మశాలి సంక్షేమ సంఘం కార్యవర్గం లేదని కొందరు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. పద్మశాలి సంక్షేమ సంఘం ఏర్పాటైన దగ్గర నుంచి తానే అధ్యక్షుడిగా పని చేస్తున్నానన్నారు. మళ్లీ ఎన్నిక నిర్వహించి కొత్తగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడి ఎన్నుకునే వరకు తానే అధ్యక్షుడిననే విషయం కొందరు సభ్యులు తెలుసుకోవాలన్నారు. సంఘ నాయకులు మాట్లాడుతూ పద్మశాలి సంక్షేమ సంఘం కోసం రామకృష్ణ ఎంతో కృషి చేశాని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో చేనేత కులాలకు చెందిన 135 కోట్ల రుణాలను మాఫీ చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సమావేశంలో ఆమంచి ఆంజనేయులు, పేరుశెట్టి లాలయ్య, పొన్నగంటి మహాలక్ష్మి, పాండురంగారావు, భాస్కరావు, నేమాని ఆదివిష్ణు పాల్గొన్నారు.

నాన్నంటే కొండంత భరోసా


ఫాదర్స్ డే వేడుకల్లో పాల్గొన్న రామకృష్ణ

బోట్‌క్లబ్: నాన్నంటే పిల్లలకు కొండంత భరోసా ఉంటుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి చిట్ల కిరణ్ అన్నారు. స్థానిక సాయి భార్గవ స్కానింగ్ సెంటర్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఫాదర్స్ డే నిర్వహించారు. సభ్యులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకొన్నారు. కుమార్తెలు ఎంత ఎదిగినా తండ్రికి చిన్న పిల్లలే, యువరాణులే అన్నారు. డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లలకు ఎంత కష్టమెచ్చినా నేనున్నానని భరోసా ఇచ్చే వ్యక్తి తండ్రి అన్నారు. చిటికెన వేలు పెట్టి నడిపిస్తూ ఆసరాగా ఉండి, ఎండా, వాన లెక్కచేకుండా రక్షణ కల్పించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేర్చే త్యాగశీలి నాన్న అన్నారు. అమ్మలాగ నిన్ను నిరంతరం ప్రేమిస్తున్నానంటూ చెప్పలేకపోవచ్చు కానీ నీ రక్షకుడై నిరంతరం నిన్ను ఓ కంట కనిపెడుతున్న నీడ నాన్న అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు దొరబాబు, ఆదిత్య, శ్రీమన్నారాయణ, గౌతమ్, మూర్తి పాల్గొన్నారు.

'పరివర్తన'లో ఫాదర్స్ డే


ఫాదర్స్‌డే వేడుకల్లో పాల్గొన్న వైద్యులు

బోట్‌క్లబ్: స్థానిక పరివర్తన వీధి బాలల వసతి గృహంలో ఆదివారం ఫాదర్స్ డే నిర్వహించారు. వసతి గృహం నిర్వాహకులు వక్కలంక రామకృష్ణకు అక్కడ విద్యార్థులు ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఎక్కడ పుట్టామో తెలియని తమను రామకృష్ణ తండ్రిలా అక్కున చేర్చుకుని ఆదరిస్తూ విద్యాబుద్ధులు నేర్పిస్తూ సమాజంలో క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులు కేక్ కట్ చేసి రామకృష్ణకు తినిపించారు. రామకృష్ణ మాట్లాడుతూ పరివర్తన పిల్లలకు ఎందరో సహాయ సహకారాలు అందిస్తూ తండ్రిలా ఆదరిస్తున్నారన్నారు. పరివర్తన విద్యార్థులకు అందిస్తున్న సేవల్లో తన భార్య సహకారాన్ని ఎప్పటికీ మరువలేనన్నారు.

పిల్లలను తీర్చిదిద్దిన పీఎంపీకి సన్మానం


పీఎంపీ సూర్య ప్రకాష్‌ను సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: పిల్లలకు మార్గదర్శి తండ్రి. ఆయన ప్రేమ, కష్టార్జితం వల్ల ప్రతి బిడ్డ ఉన్నత వ్యక్తిగా రూపొందుతాడు. ముగ్గురు అమ్మాయిలను ఉన్నత చదువులు చదివించి వైద్యులుగా తీర్చిదిద్దడంతో పీఎంపీ సూర్యప్రకాష్‌ను రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఫాదర్స్‌డేను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సూర్య ప్రకాష్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

తాళ్లరేవు: క్రీమ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు దొమ్మేటి వసంతరావు, దొమ్మేటి సామ్యూల్‌సాగర్ తెలిపారు. స్థానిక సంతపేట సెంటర్‌లోని హైస్కూల్ పక్కన బాప్టిస్టు చర్చిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ శిబిరం నిర్వహిస్తారన్నారు. పిఠాపురం సీఎంసీ నేత్ర వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేయడంతోపాటు ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తాళ్లరేవు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సామ్యూల్ సాగర్ కోరారు.

పారదర్శకంగా కౌన్సెలింగ్ ప్రక్రియ


ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ వీల్ చైర్‌లో కౌన్సెలింగ్‌కు హాజరైన సచివాలయ ఏఎన్ఎం

కాకినాడ క్రైం: సచివాలయ ఏఎన్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ నరసింహ నాయక్ వెల్లడించారు. ఆదివారం కాకినాడ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. 400 మందికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 390 మంది సచివాలయం ఏఎన్ఎంలు ఈ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. పదిమంది గైర్హాజరయ్యారని డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఏఎన్ఎంల నుంచి ఎంపీ ఏడబ్ల్యూఎఫ్‌లుగా వీరంతా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో పదోన్నతి, బదిలీలకు నిర్వహించిన ఈ కౌన్సిలింగ్‌లో అభ్యర్థులకు తాము కోరిన సెంటర్లను కేటాయించామన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన ఈ కౌన్సిలింగ్‌లో 9 మంది అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి ఆర్థిక సాయం

తాళ్లరేవు: ఎటువంటి తోడులేని దివ్యాంగుడు నేరేడిమిల్లి ఏడుకొండలుకు గొల్లపాలెం లయన్స్ క్లబ్ సెక్రటరీ జక్కన రాజేష్ రూ.మూడు వేల ఆర్థిక సహాయం అందజేశారు. రాజేష్ తన పుట్టినరోజు సందర్భంగా తాళ్లరేవులో పలు సేవా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక జెల్లావారిపేట గ్రామానికి చెందిన ఏడుకొండలు గృహ నిర్మాణం చేసుకుంటున్న సందర్భంగా సాయం చేశారు.

ఖాకీ చొక్కా అంటే లెక్కలేదా

- యూనిఫాం ధరించని ఆటో డ్రైవర్లు
- గుర్తింపు కోసమే ఖాకీ చొక్కాలు
- ఉచితంగా ఇచ్చి, అవగాహన కల్పించినా వారిలో మారని తీరు


సామర్లకోటలో డ్రైవర్లకు చొక్కాలను అందజేసిన డీఎస్పీ, సీఐ (ఫైల్)

సామర్లకోట: ఏ రంగంలో పని చేసేవారికైనా ఆ సంస్థ యూనిఫాం వారికి గుర్తింపు తీసుకువస్తుంది. పోలీసు, వైద్య, న్యాయ, కార్మిక రంగాలల్లో పనిచేసేవారికి విలువనిచ్చేది వారి దుస్తులే. యూనిఫాం చూడగానే వారు ఏ వృత్తి వారో గుర్తించవచ్చు. ఎవరైనా వారి యూనిఫాంను గౌరవించాల్సిందే. ఇది వారి కర్తవ్య నిర్వహణను సైతం సూచిస్తుంది. కానీ కొందరు వారి యూనిఫాంను ధరించడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తుంటారు. కొందరు ఆటో డ్రైవర్లు ఈ కోవకే చెందుతారు. 1993 నాటి నిబంధనల మేరకు అన్ని ప్యాసింజర్ వాహనాల డ్రైవర్లు, కండక్టర్లు యూనిఫాం తప్పక ధరించాలి. సామర్లకోటలో సుమారు 850 వరకు ఆటోలు ఉన్నాయి. మండల పరిధిలో ఆటో డ్రైవర్లకు ఈ మేరకు అవగాహన కలిగిస్తూ ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు కొందరి దాతల సహకారంతో యూనిఫాం చొక్కాలను ఇటీవల అందజేశారు.

అవగాహన శూన్యం

ఈ మేరకు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాలకు ఆటోలు నడుపుతున్న పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ, వేట్లపాలెం, ఉండూరు, రైల్వే స్టేషన్ స్టాండ్‌లలోని పలువురు డ్రైవర్లకు ఉచితంగా వాటిని అందించారు. వారిని చూసి మిగిలిన వారు స్వచ్ఛందంగా ధరిస్తారని పోలీసులు ఆశించారు. కానీ యూనిఫాం పొందిన వారు సైతం దానిని పక్కన పెట్టడం విస్మయానికి గురి చేస్తోంది.

ఉద్దేశం ఇదీ..

ఖాకీ రంగు చొక్కా ధరించి ఉంటే అతడిని ఆటో డ్రైవర్‌గా గుర్తించడానికి అవకాశం ఉంటుంది. టీషర్టులు, మోడల్ దుస్తులు ధరించి ఆటోల వద్ద ఉండటంతో ఎవరు ఆటో డ్రైవరో, ప్రయాణికులు ఎవరో గుర్తించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వీటిని అధిగమించడానికి పోలీసులు చేస్తున్న ప్రయత్నాలకు ఆటో డ్రైవర్లు సహకరించక పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్దాపురం మరిడమ్మ తిరనాళ్లలో అనేక ప్రాంతాల నుంచి సామర్లకోట వచ్చిన ప్రజలు ఆటోలలో పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి తరలి వెళ్తారు. అటువంటి సమయంలో ఆటో డ్రైవర్లను ఏలా గుర్తించాలో తెలియని పరిస్థితి నెలకొంటోంది.


ప్రయాణికురాలితో మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు


యూనిఫాం లేకుండా ఆటో నడుపుతున్న డ్రైవర్

నియమాలు ఇవీ..

దేవదాయ శాఖలో పని చేసే సిబ్బంది, వైద్య సిబ్బంది, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది తప్పని సరిగా తెలుపు దుస్తులు ధరించాలి. పోలీసు, ఆర్టీసీ డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు ఖాకీ దుస్తులు ధరించాలి. రైల్వే గ్యాంగ్‌మన్లు, శానిటరీ వర్కర్లు, వివిధ పరిశ్రమలలో పని చేసే వారికి గుర్తింపు ఉండే విధంగా పరిశ్రమలు కార్మికులకు యూనిఫాం ఏర్పాటు చేశారు. ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు కూడా వారు నిర్దేశించిన యూనిఫాం ధరించేలా చర్యలు తీసుకొన్నారు. దేవాలయాలల్లో పని చేస్తున్న సిబ్బందికి ఇచ్చిన తెలుపు యూనిఫారం ధరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన యూనిఫారం ధరించని వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మరి అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

సూచనలు తుంగలోకి



ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు తేడా కనిపించడం లేదు. ఆటో డ్రైవర్లు అందరూ విధిగా యూనిఫాం ధరించాలి. ట్రాఫిక్ పోలీసులు ఇటీవల కాలంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పట్టణ పరిధిలోని ఆటో స్టాండ్‌లలోని డ్రైవర్లకు దాతల సహకారంతో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు డీఎస్పీ ఆధ్వర్యంలో ఉచితంగా చొక్కాలను పంపిణీ చేశారు. పోలీసులు అందరికీ యూనిఫాం ఇవ్వలేరు. మిగిలిన వారికి అవగాహన వస్తుందనే చేసిన కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉంది.

– ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్, సామర్లకోట.

అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తాం



ట్రాఫిక్ ఎస్సై గరగారావు ఆటో డ్రైవర్లకు యూనిఫారం ఇచ్చే మంచి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఆటో డ్రైవరూ ఖాకీ యూనిఫాం ధరించాలి. అందరితో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తాం.

– డి శ్రీహరిరాజు, డీఎస్పీ, పెద్దాపురం